క్లుప్తంగా

మాజీ సైనికులకు ఘన సత్కారం



ఆర్మీ సైనికులను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికులను క్లబ్‌కు ఆహ్వానించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌లో వారు నేర్చుకున్న క్రమశిక్షణ, నిజాయతీ, దేశభక్తి, వారి అనుభవాలను చక్కగా వివరించారు. దేశం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన సైనికులను సత్కరించుకోవడం మన బాధ్యత అని ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ గవర్నర్ శుభ, కార్యదర్శి ఎం.జయ, సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలను కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి లోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1069వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జోష్ నింపిన సంక్రాంతి సంబరాలు



శిల్పారామంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించే సంప్రదాయ నృత్యాలు నిలిచాయి. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని సోమవారం శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి , జానపద నృత్యాల ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. సంక్రాంతి పండగ ముఖ్య అంశంగా రూపొందించిన నృత్య రూపకం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. కళాకారులు యశ్మిత, పద్మ,సారిక,వేదిత తదితరులు కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. జోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన నృత్యాలు అదరహో అనిపించాయి. చిన్నారుల నృత్యాలు అలరించాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తగరపువలస/భీమిలి: జీవీఎంసీ భీమిలి జోన్‌లో సోమవారం రెండు వేర్వేరు ప్రదేశాలలో పేకాట ఆడుతున్న 21 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.05 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో వార్డు బైపాస్ రోడ్డు బాలాజీనగర్‌లో నలుగురి నుంచి రూ.14,100 అలాగే బ్యాంకు కాలనీ వద్ద 17 మంది నుంచి రూ.91,650 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్టు భీమిలి సీఐ డి.రమేష్ తెలిపారు.

పల్లెల్లో పరసల కోలాహలం

- సందడిగా తీర్థాలు ప్రారంభం
- ముస్తాబైన అమ్మవార్ల ఆలయాలు



పరసలో నాటిక ప్రదర్శన(ఫైల్)



ఆట వస్తువులు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

పెందుర్తి: చిన్నారులను ఆకాశంలో విహరింపజేయడానికి రంగులరాట్నం..దానికి అమర్చిన చెక్కగుర్రం..నోరూరించే పంచదార చిలకలు..కర్జూరం.. తియ్యటి చెరకుగడలు..రకరకాల తినుబండారాలు..యువతను అలరించడానికి డ్యాన్స్‌బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు..పెద్దలకు బుర్రకథా కాలక్షేపం ఇవన్నీ ఒకేచోట లభించనున్నాయి. ఇందుకు మంగళవారం నుంచి గ్రామాల్లో ప్రారంభం అయిన అమ్మవార్ల తీర్థాలు(పరసలు) వేదిక అయ్యాయి. ఇప్పటి వరకూ సంక్రాంతి సంబరాల్లో మునిగి తేలిన ప్రజలు గ్రామంలో జరిగే పరసలు సందడిగా నిర్వహించుకోవడానికి సిద్ధమయ్యారు. పెందుర్తి నియోజకవర్గ ప్రాంతంలో అనేక గ్రామాల్లో కనుమ రోజు రాములవారి తీర్థం జరిగాక అమ్మవార్ల పరసలు ఆరంభమవుతాయి. ప్రతీ గ్రామంలోనూ జరిగే ఈ పరసలు మహాశివరాత్రితో ముగుస్తాయి.

సంప్రదాయాలకు ప్రతీక..

పల్లెల్లో గ్రామదేవత పరసలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అమ్మవారి ఆలయం ముందు సాముగరిడీలు, తప్పెటగుళ్లు, భజనలు, కోలాటాలు వంటి జానపద కార్యక్రమాలు చూడముచ్చటగా ఉంటాయి. పల్లెవాసులు అమ్మవారిని ప్రత్యేకంగా పూజించి కానుకలు సమర్పిస్తారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబసభ్యులు, బందుమిత్రులను ఆహ్వానించి విందులు ఏర్పాటు చేసి ఆప్యాయతలను పంచుకుంటారు. పల్లెవాసులు ఈ పరసలను అత్యంత ప్రత్యేకంగా, సంబరంగా నిర్వహిస్తారు.

చిరువ్యాపారులకు భుక్తి..

పరసల సమయంలో అనేకమంది చిరువ్యాపారులకు ఆదాయం బావుంటుంది. పంచదార చిలకలు, కర్జూరం, బెలూన్లు, మిఠాయిలు, చెరుకుగడలు, ఇతర తినుబండారాలను అమ్ముకుని నాలుగురాళ్లు వెనకేసుకుంటారు. చిన్నాపెద్దా అందరికీ వినోదం పంచే రంగులరాట్నంకు పరసల్లో మంచి డిమాండ్ ఉంటుంది. చెక్క గుర్రాలపై ఎక్కి రాట్నం తిరుగుతుంటే ఆ అనుభూతే వేరు. డ్యాన్స్‌బేబీ డాన్స్, బుర్రకథ, నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల కళాకారులలు బిజీబిజీగా ఉంటారు. మొత్తానికి చిరువ్యాపారులు, కళాకారులకు మాములు రోజుల కంటే సుమారు పది రెట్ల ఆదాయం పరసల సమయంలోనే వస్తుంది. డ్యాన్స్ బేబీ డాన్స్, జానపద కళలు, నాటికలు, నాటకాలు ప్రదర్శనలతో కళాకారులు పొట్టపోసుకుంటారు.

ఆటల పోటీలు...

గ్రామాల్లో పరసకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు. గ్రామీణ క్రీడలు అయిన బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీలతో పాటు ప్రజారంజకమైన క్రికెట్, వాలీబాల్, షటిల్‌బ్యాడ్మింటన్ వంటి టోర్నీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పల్లెవాసులు ఉత్సాహంగా పాల్గొంటారు. పరస రోజు వేదిక మీద బహుమతుల ప్రదానం ఆకర్షణగా ఉంటుంది.

జూదరుల జోరు..

మరోవైపు పరసల సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటారు జూదశిఖామణులు. కోడి పందాలు, పేకాట, లాటరీబల్లలు వంటి ఆటల్లో మునిగితేలుతుంటారు. పోలీసులు కళ్లుగప్పి రహస్య ప్రదేశాల్లో రూ. వేలు, లక్షల్లో పందాలు కాస్తుంటారు. కొన్ని చోట్ల మందు పార్టీలు, రికార్డింగు డ్యాన్స్‌లు ఏర్పాటు చేసుకోవడం మామూలే. అయితే వీరి ఆటలు కట్టించడానికి తాము సిద్ధంగా ఉన్నామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పరసల సమయంలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసు సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు.



ఎర్రయ్యమ్మ పేరంటాలును దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చల్లగ చూడు ఎర్రయ్యమ్మా..

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన ఎర్రయ్యమ్మ పేరంటాలు తీర్థాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. సాముగరిడీలు, చిన్నపిల్లల కోలాటాలు, మందుగుండు సామగ్రి కాల్పులు ఆకర్షణీయంగా నిలిచాయి. ఎర్రయ్యమ్మ పేరంటాలుకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు , జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు పైల హరీష్, వెంకటరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల పైడినాయుడు, చీపురుపల్లి శ్రీనివాసరావు ఎర్నినాయుడు దర్శించుకున్నారు.

ఘనంగా రాముల వారి పరస

వాడచీపురుపల్లిలో రాముల వారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తీర్థ మహోత్సవంలో పాల్గొన్నారు. చిడతలు, సాముగరిడీలు, నేల డ్యాన్సులు, భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లలితా దీక్షలు ప్రారంభం



స్వామీజీ చేతుల మీదుగా లలితా దీక్ష తీసుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో సంక్రాంతి రోజున లలితా దీక్షలు ప్రారంభమయ్యాయి. మాఘ పౌర్ణమి వరకు 21 రోజుల పాటు దీక్ష కొనసాగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యుడు సత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు అమ్మవారి దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోవుకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు



గోపూజలో భాగంగా సంప్రదాయ వేషధారణలో గ్రామస్తులు

సింహాచలం: కనుమ పండగ పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు. శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకృష్ణాష్టకం పఠించి విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చినయాతపాలెంలో..

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెం గ్రామంలో కనుమ పర్వదినాన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం గోపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, సభ్యులు మళ్ల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధిగా బుద్ధ నరసింహారావు పాల్గొని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య చినయాతపాలెంలో గోమాతకు గ్రామస్తులంతా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో శ్రీరామ నామస్మరణతో అయోధ్య రాముడిని గుర్తు చేస్తూ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తుంపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావు, మళ్ల రాము, మళ్ల గంగు నాయుడు, మళ్ల నాగభూషణం, మళ్ల సత్యనారాయణ, బొడ్డేటి కాశీ సూరి అప్పారావు, హరిదాసు వేష ధారణలో అలరించారు. దొడ్డి మహేశ్వరరావు, గంగి రెద్దులు ఆడించే వేషధారి శరగడం రామ కోటి తదితరులు తమ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు



క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు



పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

- ఉత్సాహంగా ముగ్గులు, క్రీడాపోటీలు
- విజేతలకు బహుమతుల అందజేత

పరవాడ: సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయా గ్రామాల పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

➡ పెదముషిడివాడలో సర్పంచ్ పల్లా నాగమణి కుమారుడు అప్పారావు, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. రన్నర్, విన్నర్ జట్లకు రూ.5 వేల చొప్పున ఎంపీటీసీ వెంకటరావు మంగళవారం అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ వెంకటరావు

➡ మండలంలోని నాయుడుపాలెం శివారు రాముడుగారి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా యువత, మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. మహిళలకు ముగ్గులు పోటీలు, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు. ముగ్గులు పోటీల్లో విజయం సాధించిన కన్నూరు సౌజన్య, ఉట్టి కొట్టే పోటీల విజేత కన్నూరు శివ లక్ష్మీదేవిలకు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, ఉప సర్పంచ్ రాజాన ముత్యాలు, యూత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


సామాన్యులకు నిస్వార్థంగా సేవలు

మహారాణిపేట : సామాన్యులకు తన వంతు సేవలందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురుపీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు. పీఠం గత 30 సంవత్సరాల నుంచి చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్ (ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించారు. అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే, పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని ఆయన అన్నారు. 1994లో స్వర్గీయ డాక్టర్ టి.వి.వి.ఎస్.రావు నేతృత్వంలో ఇక్కడ మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు తెలిపారు. సంస్కృతీ భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, దాతలు, కార్యకర్తలకు సత్యదేవ్ కృతజ్ఞతలు తెలిపారు జగద్గురుపీఠం సలహా మండలి సభ్యులు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవ, ఆధ్యాత్మిక సాధన, త్యాగనిరతి అనేవి తరించడానికి దోహదపడతాయన్నారు. యజ్ఞార్థ జీవనాన్ని మాస్టర్ ఈకే అలవరిచారన్నారు. బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు. సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని ఆయన చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి. వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యులు జి.వి.ఎస్. హరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీహెచ్ఎస్ఎన్ రాజు, సత్యదేవ్, బీఆర్‌కే రాజు

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు



అప్పన్న ఉత్సవమూర్తుల చెంతన పాశుర విన్నప పఠనం చేస్తున్న స్థానాచార్యులు, అర్చకులు



స్వామి, అమ్మవార్లను తిరువీధిగా తీసుకొస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ధారోత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిని,గోదాదేవి ఒక పల్లకీలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అదిష్టింపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మ వారిని, ఆళ్వారులను మకో పల్లకీలో వేంచేయజేసి మేళతాళాల మధ్య ఆలయం నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. పాశుర విన్నప పఠనం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యు లు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. మకర జ్యోతి దర్శనం



విశేషాలంకరణలో అయ్యప్పస్వామి



ధ్వజస్తంభంపై కర్పూర జ్యోతి

ఉక్కునగరం: ఉక్కునగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం భక్తులను పరవశులను చేసింది. సంక్రాంతి సందర్భంగా లభించే ఈ దివ్యజ్యోతి దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఉక్కునగరం అయ్యప్ప ఆలయంలో సోమవారం వేకువజామున గణపతి హోమం నిర్వహించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. స్వామికి అష్టాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలో స్వాములు ప్రవేశించే 18 మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వామికి సంధ్యా హారతి ఇచ్చారు. ఆలయం ధ్వజస్తంభంపై కర్పూర జ్యోతి దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు



ఆభరణాలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు పీలా రమణ అయ్యప్ప స్వామి ఆభరణాలను తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగించారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాడి ఆవుల మృతి





మృతి చెందిన పాడి ఆవులు

పరవాడ: సంక్రాంతి పండగ వేళ మండలంలోని తాడి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వ్యర్థ జలాలు తాగడంతో రెండు పాడి ఆవులు అనారోగ్యానికి గురై సోమవారం ఉదయం మృతి చెందాయని పాడి రైతులు తాడి గ్రామానికి చెందిన గుమ్మాల రాజు, కర్రి నూకరాజుకు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తెలిపిన వివరాలు.. ఫార్మా పరిశ్రమలకు అతి సమీపంలో నివసిస్తున్న తాడి గ్రామానికి చెందిన రైతులు తమ ఆవులను మేత కోసం ఫార్మాసిటీలో ఖాళీ ప్రదేశాలకు తీసుకు వెళుతుంటారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఇరువురు రైతులు తమ ఆవులను మేత కోసం ఆరుబయటకు తీసుకువెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో పంప్‌హౌస్ వద్ద నిలిచిన వ్యర్థ జలాలను ఆవులు తాగాయి. అనంతరం రెండు ఆవులు అస్వస్థతకు సోమవారం ఉదయం చనిపోయాయని రైతులు బోరున విలపిస్తూ చెప్పారు. మృతి చెందిన పాడి ఆవుల విలువ సుమారు లక్షన్నర రూపాయలు ఉంటుందని రైతులు చెప్పారు. ఫార్మా యాజమాన్యాలు యథేచ్ఛగా వ్యర్థ జలాలను కాలువలు, గెడ్డలు, చెరువుల్లోకి విడుదల చేయడం వల్ల మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆరోపించారు. ఫార్మా యాజమాన్యాలు విచ్చల విడిగా వదులుతున్న వ్యర్థ రసాయనాల కారణంగా నష్టపోతున్న రైతులకు ముక్కుబడిగా నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని స్థానిక నాయకుడు బంతిగోరు గోవిందు ఆరోపించారు. మృత్యువాత పడిన పాడి ఆవులకు చెందిన యజమానులను ఫార్మా యాజమాన్యాలు ఆదుకోవాలని కోరారు.